క్లుప్తంగా

గ్రామదేవత ఆలయ ప్రతిష్ట



పూజలు జరిపిస్తున్న అర్చకుడు రాంబాబు

బలిజిపేట: మండలంలోని మిర్తివలస గ్రామదేవత గజాల తల్లి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రాంబాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామదేవతకు ఇంతవరకు ఆలయం లేకపోవడంతో నిర్మించి ప్రతిష్ట జరిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా పెద్దసంఖ్యలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పైనే మురుగునీరు



దుగ్గసాగరం గ్రామంలో రోడ్డు పైనే పారుతున్న మురుగునీరు

సాలూరు రూరల్: మండలంలోని నెలిపర్తి పంచాయతీ దుగ్గసాగరం గ్రామంలో కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు పారుతోంది. దీంతో గ్రామ ప్రధాన రహదారి అంతా బురదమయంగా ఉంటోంది. గ్రామంలోకి ప్రవేశించేందుకు ఆ మురుగునీటిని దాటుకుని వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో కాలువల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్ కమిటీకి మంత్రి అభినందనలు



మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గంతో మంత్రి సంధ్యారాణి

సాలూరు: సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని స్త్రీశిసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం అభినందించారు. కమిటీ చైర్మన్‌గా ముఖి సూర్యనారాయణ, వైస్‌చైర్మన్‌గా మింది సింహాచలంతో కూడిన 15 మంది కమిటీ సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన పెంపొందించాలి

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

సాలూరు: పౌష్టికాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన పెంపొందించాలని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహారపదార్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల ఆవశ్యకతను వివరించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు ,అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు


సీతానగరం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, వర్క్‌ఫ్రమ్ హోం పనుల్లో ఉన్నవారికి పనులు కల్పించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు అన్నారు, ఈ మేరకు మంగళ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ అధ్యక్షతన గ్రామాల్లో ప్రజాసమస్యలపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్వాహకులతో వేగవంతం చేయించాలని, తాగునీటి సమస్యపరిష్కరించాలని, బోర్ల మరమత్తులు చేపట్టాలని సూచించారు. అలాగే ఇదివరలో పూర్తయిన హౌస్‌హోల్డ్‌లో వచ్చిన తప్పిదాలను సరిచేసి అప్‌లోడ్ చేయాలని కార్యదర్శులకు స్పష్టం చేశారు.

పాడి దిగుబడికి వడదెబ్బ

- వడదెబ్బకు గురైతే చూడి కట్టే అవకాశం లేనట్లే
- పాల ఉత్పత్తిపై ప్రభావం
- ప్రాణాలు కోల్పోయే ప్రమాదం
- వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలతో సంరక్షణ



పాలు తీస్తున్న రైతు



వేసవి ఎండలో మేస్తున్న పాడిగేదెలు

బలిజిపేట: వేసవిలో పాడిరైతులు పశుపోషణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో పాడి ఆవు వడదెబ్బ బారిన పడితే పాలఉత్పత్తి తగ్గడమే కాకుండా, ఎదకు వచ్చే పరిస్థితులు తగ్గిపోతాయి. చూడి నిలిచే అవకాశం ఉండదు. వేసవిలో పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పడి పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పశు వైద్యశాఖాధికారులు సూచిస్తున్నారు.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు

- పశువులు తాగే నీరు స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచాలి.
- వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతాయి.
- రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించడం అవసరం.
- ఆరుబయట తొట్టెలో పగలు నిల్వ ఉన్న నీరు వెచ్చగా మారుతాయి.
- నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు తాగించాలి.
- ఆవులతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి.
- ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయసు ఆధారంగా రోజుకు సుమారు 35లీటర్ల నీరు అవసరం.
- పాలిచ్చే పశువులు అదనంగా ప్రతిలీటరు పాల దిగుబడికి 4నుంచి 5లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి.

నల్లజాతి పశువులకు ఎక్కువ ప్రమాదం

ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసారం సరిగా లేని ప్రాంతాల్లో, ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసిపోయనప్పుడు, నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు పశువులు అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. సాధారణంగా ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఒకేసారి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. తెల్లజాతి పశువుల కంటే నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు లోనవుతాయి.

వడదెబ్బ నివారణ చర్యలు

- పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు చల్లని నీటితో తడుపుతూ ఉండాలి.
- పశువుల పాక పాత రేకులతో వేసినట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకు, వరి గడ్డితో కప్పాలి.
- మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి.
- పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి.
- పశువులకు వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి.
- సంకరజాతి ఆవులకు, గేదెలకు పాకలో ఫ్యాన్లు ఏర్పాటుచేయాలి.
- చెరువులు, కుంటలు ఉన్నట్లయితే పశువులను వాటిలో కాసేపు ఈదనివ్వాలి.

వడదెబ్బ లక్షణాలు:

- పశువులో శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 106డిగ్రీల వరకు పెరుగుతుంది పశువులు నడిచేటప్పుడు తూలుతాయి.
- శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది.
- పశువు చాలా నీరసంగా కనిపిస్తుంది.
- నోటివెంట చొంగ కారుతుంది.
- ఒక్కోసారి కింద పడి విలవిల్లాడి స్పృహకోల్పోతాయి.
- ఆసమయంలో పశువు నీటి కోసం అల్లాడుతుంది.
- చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది.
- పాల ఉత్పత్తి కోల్పోతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువులో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది.

వడదెబ్బ నివారణకు చికిత్స

వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. ఐస్‌ను పలుచటి వస్త్రంలో చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి. కొద్దిగా ఊరట కలిగిన తరువాత దగ్గరలోని పశువైద్యుడిని సంప్రందించి, వైద్యుడి సూచనల మేరకు సెలైన్ పెట్టాలి.

వేసవిలో అప్రమత్తం

వేసవిలో పశువుల విషయంలో అప్రమత్తం అవసరం. పాడి పశువులను ఉదయం 7గంటల నుంచి 10వరకు, సాయంత్రం 4గంటల తరువాత మేతకు వదలాలి. ఎండబారిన పడకుండా చూడాలి. ఇంటివద్ద ఉండేటప్పుడు చెట్ల నీడన కట్టాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రందించి చికిత్స చేయించాలి. చల్లని వాతావరణం కల్పించాలి.

గొంగాడ గణేష్,
మండల పశువైద్యాధికారి, బలిజిపేట

పైప్‌లైన్ పనులు ప్రారంభం



వేస్తున్న పైప్‌లైన్

బలిజిపేట: మండలంలోని గంగాడలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నారు. గ్రామ సర్పంచ్ వి.లక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో పైప్‌లైన్ పనులు చేపట్టారు. మరువాడ వద్ద వేగావతి నదిలో నుంచి ఈ గ్రామానికి నీటి సరఫరా జరుగుతుంది. ప్రారంభంలో ఉండే పాత పైప్‌లైన్ పాడవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలగగా పంచాయతీ నిధులు రూ.6లక్షలతో 500మీటర్లకు సంబంధించి హెచ్‌డీపీఈ 110ఎంఎం డయాస్ కొత్త పైపు వేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. పూర్తిస్థాయిలో 3కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్ వేయాలంటే రూ.15లక్షల వరకు నిధులు అవసరం అయినందున పంచాయతీ వద్ద అంత మొత్తం లేకపోవడంతో 500మీటర్ల వరకు కొత్త పైపులు వేసి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే కనెక్షన్లు కలిపి నీటిసరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలు తగ్గించాలి



బలిజిపేటలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, ప్రజలు

బలిజిపేట: కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బలిజిపేటలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు గేదెల సత్యనారాయణ, యమ్మల మన్మథరావులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని ప్రజలకు నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఇప్పుడు గ్యాస్ బండపై ఏకంగా రూ.50పెంచి సామాన్య మానవుడిపై మోయలేని భారాన్ని వేశాయని మండిపడ్డారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దారుణమన్నారు. ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా రూ.50పెంచడం మరీ దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను తగ్గించి పేదవాడిపై భారాన్ని మోపకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో హరి, లక్ష్మణ, భానుమూర్తి, ఎస్.ఈశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

350 మంది గిరిజనులకు వైద్యసేవలు



గిరిజన మహిళలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు



గిరిజన మహిళకు దుప్పట్లు అందిస్తున్న ఎస్ఐ

సాలూరు రూరల్: మండలంలోని నేరెళ్లవలస గ్రామంలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఏడుగురు డాక్టర్లు 350మంది గిరిజనులకు వైద్యసేవలు అందించారు. వివిధ వ్యాధులతో వచ్చిన గిరిజన రోగులకు అవసర మైన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే రగ్గులు ,బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై నరసింహమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించామన్నారు. గిరిజనులకు అన్ని రకాలుగా పోలీసులు సేవలందించడంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.వందన, కె.వినయ్‌సాయి, కె.పావని, ఎం.సింహచలం, ఎ.అబ్రహం, ఎస్.శ్రీరామ్, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకే ఇంటిపన్ను



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు అప్పల నాయుడు, గిరిరఘు

సాలూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన గతేడాది నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకే ఇంటిపన్ను పేరు మార్పు ఫీజు తగ్గింపు చేస్తూ మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ ఉత్తర్వులు జారిచేశారని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు,కౌన్సిలర్ గిరి రఘులు అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో వారు మాట్లాడుతూ, ఇంటి పన్ను, పేరు మార్పు ఒకశాతం వల్ల ప్రజల్లో భారం పెరుగుతుందని, అంతేకాక దానిపై ప్రజల్లో కొంత వ్యతిరేకత వచ్చిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన, రియల్‌ఎస్టేట్ వ్యాపారం తక్కువగా ఉన్న పట్టణంలో ఇంటి పన్ను పేరు మార్పుకు సంబంధించి ఫీజు ఒకశాతం విధిస్తే ప్రజలకు ఆర్థికభారం అవుతుందని మెజారిటీ కౌన్సిల్ సభ్యులు భావించార న్నారు. కావున అరశాతానికి ఈ ఫీజు తగ్గించాలని మెజారిటీ కౌన్సిలర్లు గతంలో డిమాండ్ చేశారని తెలిపారు. దీనిపై తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు వివరించారు. ఈ మేరకు పన్నును అరశాతానికి తగ్గింపు చేస్తూ మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ ఉత్తర్వులు జారిచేశారని పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



సంగంవలసలో నగర సంకీర్తన చేస్తున్న శ్రీ రామభక్త బృందం

పార్వతీపురం రూరల్: చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా మండలంలోని సంగంవలస గ్రామంలో శ్రీ రామ భక్త బృందం ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో రామకీర్తనలను ఆలపించారు. అలాగే పలు భక్తిగీతాలు, భజనలు చేసి భక్తుల్లో ఆధ్యాత్మిక భావం కలిగించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- అధికార పార్టీ నాయకుల వేధింపుల నుంచి కాపాడాలి
- కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ బీవీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు బీవీ రమణ

సాలూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఫీల్డ్ అసిస్టెంట్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అతి తక్కువ వేతనానికి పనిచేస్తున్న ఫీల్డ్ అసిసెంట్లకు ఉద్యోగభద్రత కల్పించడంతో పాటు వేతనాలు పెంచాలని కోరారు. రోజురోజుకు ఫీల్డ్ అసిసెంట్లపై ప్రభుత్వం పనిభారం పెంచుతోందని, అలాగే ఇటీవల రాజకీయ వేధింపులు పెరిగాయని వారినుంచి చిరుద్యోగులమైన తమను కాపాడాలని కోరారు. ఫీల్డు అసిసెంట్లను కించపరిచే విధంగా అధికార పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సాలూరు, పాచిపెంట ,మక్కువ మండలాల ఫీల్డ్ అసిసెంట్లు, యూనియన్ నాయకులు మండలంగి హరనాథ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లుల్లో కోత



మాట్లాడుతున్న పీఆర్ క్యూసీ డీఈఈ లక్ష్మణరావు

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, కాలువలు కల్వర్టుల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లుల్లో కోతలు తప్పవని పీఆర్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ బి.లక్ష్మణరావు అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ 2024–25 ఆర్థిక సంవత్సరం నిదులతో గుచ్చిమి, కాశీపేట, పణుకుపేట, అంటిపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో జరిగిన పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈఈ లక్ష్మణరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉపాధిహామీపథకం నిధులతో జరుగుతున్న పనుల ఆరంభంలోనే నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టినప్పుడే పనులు దీర్ఘకాలం ఉంటాయన్నారు. ఇంజినీరింగ్ అధికారుల పర్య వేక్షణలో నిర్వాహకులు పనులు ఆరంభించాలని, వారిచ్చిన సూచనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి గంట చంద్రమౌళి, ఇంజినీరింగ్ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ త్రినాధ, నిర్వాహకులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో తాగునీరు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్...



చలివేంద్రంలో ఏర్పాటు చేసిన తాగునీరు

పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయం ముఖద్వారం వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెలకొల్పిన చలివేంద్రంలో తాగునీరు ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో తాగునీరు లేనందున మంగళవారం సాక్షి దినపత్రికలో చలివేంద్రం ఏర్పాటు సరే.. నీరేది?'' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి చలివేంద్రంలో తాగునీటిని ఏర్పాటు చేశారు. దీంతో కలెక్టర్ కార్యాలయానికి వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

ప్రైవేట్ వ్యక్తులకే మొక్కజొన్న అమ్మకాలు

- కానరాని కొనుగోలు కేంద్రాలు
- ప్రభుత్వ విధానాలతో దగా పడుతున్న రైతులు



మండుటెండలో మొక్కజొన్నలు ఏరుతున్న రైతులు



రోడ్డుపై ఆరపెట్టిన మొక్కజొన్నలు

సాలూరు రూరల్: పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకే పంట చేరే విధంగా చర్యలు తీసుకుంటామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఆచరణ లో మాత్రం కనీసం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాలూరు మండలంలో మొక్కజొన్న రైతులకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకే అమ్మకాలు చేయాల్సి వస్తోంది. మొక్కజొన్న క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర 2200 గా నిర్ణయించినప్పటికీ అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో మండలంలోని రైతులు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలు చేస్తుండగా దళారులు ఇచ్చిందే ధర తూచిందే కొలతగా అమ్మకాలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. తొలి రోజుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే ప్రైవేట్ వ్యక్తులు ఎక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు కొంత సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ ధర కాస్త రూ.1900 నుంచి రూ.2000గా దళారులు కొనుగోలు చేస్తుండడంతో ప్రభుత్వం నిర్ణయించిన రూ.2200 ధరపై కొనుగోలు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని అంటున్నారు. మొక్కజొన్న తడిగా ఉన్నాయని మరికొంచెం ఆరపెట్టాలని అలాగే తూనికల్లో కూడా కేజీ చొప్పున తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో కూడా వరి రైతులు ఇలాగే కొనుగోలు కేంద్రాలకు బదులు దళారులకే ఎక్కువ మంది అమ్మకాలు చేయాల్సి వచ్చింది. మండలంలోని రైతులు ప్రభుత్వ విధానాలతో విసిగిపోతున్నారు. రైతు భరోసా లేదు. కొనుగోలు కేంద్రాలు లేవంటూ నిట్టూరుస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు లేకనే అమ్మకాలు



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రైవేట్ వ్యక్తులకు మొక్కజొన్న అమ్ముతున్నాము. తడిగా ఉన్నాయంటే మళ్లీ ఆరపెడుతున్నాం. ప్రస్తుతం ధర తగ్గిందంటున్నారు. ఎంత అంటే అంతకే అమ్మక తప్పదు. అందరూ ప్రైవేట్ వ్యక్తులకే అమ్ముతున్నారు. నేను కూడా అలాగే అమ్మక తప్పలేదు. మూడు ఎకరాల్లో 70 క్వింటాళ్లు పండించాను.

– యద్ల అనురాధ, మహిళా రైతు కూర్మరాజుపేట, సాలూరు మండలం

క్షేత్ర సహాయకుడిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

సాలూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నార్లవలస పంచాయతీ క్షేత్ర సహాయకుడిపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి ఎంపీడీఓకు మంగళవారం ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్లవలస పంచాయతీలో జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పని కల్పించడం లేదని ఆరోపించారు. అలాగే 14 రోజుల్లో వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఇంతవరకు కూలి డబ్బులు చెల్లించలేదన్నారు.ఉపాధి పని ప్రదేశాల్లో నీడ, నీరు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు వంతల సుందర్రావు, కూనేటి చినబాబు నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.